క్లుప్తంగా

బీరన్నగుడి అభివృద్ధికి విరాళం



నడికూడ : మండలంలోని కంఠాత్మకూర్ గ్రామంలో గొల్ల, కురమ కులస్తుల ఆరాధ్య దైవమైన బీరన్న కల్యాణ మహోత్సవాలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా కాంగ్రెస్ పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ మండల అధ్యక్షుడు బుర్ర దేవేందర్ గౌడ్ గుడి అభివృద్ధికి ఇనగాల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ.25 వేల చెక్కును ఆలయ కమిటీ నిర్వాహకులకు అందజేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు కు మారస్వామి, మధుకర్, మహేందర్, శ్రీనివాస్, శరత్, రాజేందర్ పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జ్‌గా మురళి



దామెర: ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జ్‌గా మండలంలోని పులుకుర్తి గ్రామానికి చెందిన జిల్లెల్ల మురళిని నియమించారు. ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లా సమావేశంలో మురళిని ఏకగ్రీవంగా మండల ఇన్‌చార్జ్‌గా నియమిస్తూ జాతీయ అధికార ప్రతినిధి బొర్ర భిక్షపతి ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మార్పీఎస్ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

కొనుగోలు కేంద్రంలో పోలీసుల తనిఖీ

దామెర: మండలంలోని పసరగొండలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని సోమవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రం వద్ద తూకం వేయడం లేదంటూ, 42 కిలోల కంటే ఎక్కువ తూకం వేస్తున్నారంటూ రైతులు ఫిర్యాదు చేశారు. దీంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు గ్రామానికి చేరుకుని పలు రికార్డులు పరిశీలించారు. అక్కడే ఉన్న రైతులు, నిర్వాహకులతో మాట్లాడారు. అనంతరం వారు మాట్లాడుతూ కొనుగోలు కేంద్రం వద్దే రైతుకు సంబంధించిన ధాన్యంను తూకం వేయాలని సూచించారు. 42 కిలోలు మాత్రమే తూకం వేయాలని సూచించారు. లేనిచో కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. రికార్డులు సక్రమంగా నిర్వహించాలని అన్నారు. తనిఖీల్లో సీఐ శ్రీనివాస్, ఆత్మకూర్ సీఐ కుమార్, ఏఎస్సై రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి నీటిచుక్కను ఒడిసిపట్టాలి



దామెర : ప్రతి వర్షపు నీటి చుక్కనూ ఒడిసిపట్టాలని సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు గట్ల విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. మండలంలోని కోగిల్వాయిలో ఇంకుడు గుంతల నిర్మాణం పనులను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ గర్భ జలాలు పెంపొందించేందుకు ఇంకుడు గుంతలు దోహదం చేస్తాయని సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ నాగరాజు, ఉపసర్పంచ్ గోల్కొండ సాంబయ్య, పంచాయతీ కార్యదర్శి సరళ, గట్ల అజయ్ రెడ్డి, రాజేశ్వరి తదితరులు ఉన్నారు.

పాలకవర్గానికి సహకరించాలి



శాయంపేట : మండలంలోని పెద్దకోడెపాక మత్స్య సొసైటీ నూతన పాలకవర్గ సభ్యులు సోమవారం తహసీల్దార్ చలమల్ల రాజు, ఎస్సై ఇమ్మడి వీరభద్రరావులను మర్యాదపూర్వకంగా కలిసి బొకేను అందించారు. అనంతరం అధికారులు నూతన పాలకవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు గండి రాజమౌళి, సొసైటీ ఉపాధ్యక్షులు ఐరబోయిన రాజు, కార్యదర్శి మోరే నరేష్, డైరెక్టర్లు భాస్కర్, సురేష్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అధికారంలోకి వస్తే రూ.2 లక్షల రుణమాఫీ

● మాజీ ఎమ్మెల్యే అల్లిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి



పెంచికలపేటలో రైతుకు మేనిఫెస్టో కరపత్రాన్ని అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే ప్రవీణ్‌రెడ్డి

ఎల్కతుర్తి : కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ముందుగా రైతులకు ఏకకాలంలో రూ.2 లక్షలు రుణమాఫీ చేస్తామని మాజీ ఎమ్మెల్యే అల్లిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి అన్నారు. మండలంలోని పెంచికలపేటలో హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా గడపగడపకు కాంగ్రెస్ నినాదంతో ప్రవీణ్‌రెడ్డి కొనసాగిస్తున్న కరపత్రాల పంపిణీ కార్యక్రమం సోమవారం పెంచికపేటలో కొనసాగింది. ముందుగా గ్రామంలో ప్రధాన కూడలి వద్ద కాంగ్రెస్ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి రాగానే గృహిణులకు కేవలం రూ.500 లకే గ్యాస్ సిలిండర్ అందజేయనున్నట్లు వెల్లడించారు. సొంత స్థలంలో ఇంటి నిర్మాణం (ఇందిరమ్మ ఇల్లు) కోసం రూ.5 లక్షలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. రాజీవ్ ఆరోగ్య పథకం కింద రూ.5 లక్షల వరకు ఉచిత వైద్యం, ఇంట్లో ఇద్దరు వృద్ధులు ఉంటే పెన్షన్ రూ.5వేలు, భూమి ఉన్న రైతులతో పాటు కౌలు రైతులకు ఎకరానికి రూ.15 వేల సాయం, భూమి లేని ఉపాధిహామీ రైతు కూలీలకు రూ.12 వేల సాయం, మొదటి ఏడాది రూ.2 లక్షల ఉద్యోగాల భర్తీ, అన్ని పంటలకు గిట్టుబాటు ధర, ధరణి పోర్టల్ రద్దు, పోడు రైతులకు పట్టాలు అందజేస్తామని విడుదల చేసిన మేనిఫెస్టో కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఆదరించి కర్ణాటక రాష్ట్రం తరహాలో తెలంగాణలో సైతం అఖండ విజయాన్ని అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎల్కతుర్తి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సుకినె సంతాజీ, సీనియర్ నాయకుడు గూటం జోగిరెడ్డి, మండ సుమన్‌గౌడ్, హింగె శ్రీకాంత్, గొర్రె మహేందర్, సర్పంచ్ మల్లారెడ్డి, రావుల రమేష్, పార్టీ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

రాజ్యాంగంపై అవగాహన కల్పించాలి



పరకాల : రాస్తారోకో చేస్తున్న డీఎస్పీ నాయకులు

● ధర్మసమాజ్ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు పూరేళ్ల రమేష్

పరకాల: భారత రాజ్యాంగంపై ప్రజలందరికీ అవగాహన కల్పించాల్సిన బాధ్యత పాలకులపై ఉందని ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు పూరేళ్ల రమేష్ డిమాండ్ చేశారు. భారత రాజ్యాంగాన్ని అందరికీ ఉచితంగా పంపిణీ చేయాలని డిమాండ్ చేసినా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రాకపోవటాన్ని నిరసిస్తూ పట్టణంలోని బస్టాండ్ కూడలిలో డీఎస్పీ ఆధ్వర్యంలో రాస్తారోకో చేపట్టి నిరసన తెలిపారు. వాహనాల రాకపోకలకు అంతరాయం బొటుచేసుకోవడంతో పోలీసులు జోక్యం చేసుకుని ఆందోళన విరమింపజేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ రాజ్యాంగంపై ఎలాంటి అవగాహన లేకపోవడంతో అన్ని రంగాల్లో అభివృద్ధి లేక అధోగతిగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా తమ డిమాండ్‌ను పట్టించుకోని పక్షంలో ఆందోళ కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో డీఎస్పీ నాయకులు నాగరాజు, హరీష్, ప్రశాంత్, కృష్ణ పాల్గొన్నారు.

రాజ్యాంగ పుస్తకాన్ని పంపిణీ చేయాలి

నడికూడ: భారత రాజ్యాంగ పుస్తకాన్ని ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేయాలని కోరుతూ సోమవారం ధర్మ సమాజ్ పార్టీ (డీఎస్పీ) తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణకు రెండోసారి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండల డీఎస్పీ ప్రచార కమిటీ అధ్యక్షుడు ప్రతాప్ మాట్లాడుతూ గతంలో వినతి పత్రాలు ఇచ్చినా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేని కారణంగా మండల కేంద్రంలో నిరసన తెలిపి, రెండోసారి వినతిపత్రం ఇచ్చినట్లు పేర్కొన్నారు. దేశాన్ని నడిపిస్తున్న రాజ్యాంగ గ్రంథంపై 90 శాతం ప్రజలకు అవగాహన లేకనే పార్లమెంటరీ ప్రజాస్వామ్యం విఫలమైపోతుందన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ నాయకులు రాజు, రాజేష్, ప్రతాప్, రత్నాకర్, విష్ణు, తిరుపతి, సాయికృష్ణ, గణేష్, అభిలాష్, తదితరులు పాల్గొన్నారు.



నడికూడ : డీటీకి వినతిపత్రం అందజేస్తున్న నేతలు

బాధిత కుటుంబాలకు పరామర్శ



హరికృష్ణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి



శాయంపేట : బాధితుల ఇళ్లను పరిశీలిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్

శాయంపేట : తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ తండ్రి డాక్టర్ సుదర్శన్ అనారోగ్యంతో ఇటీవల మరణించాడు. సోమవారం వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి పరామర్శించి సుదర్శన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.అలాగే ప్రగతి సింగారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త, గీతకార్మికుడు బొల్లం అశోక్ చెట్టుపై నుంచి పడి మృతి చెందగా జెడ్పీ చైర్‌పర్సన్ జ్యోతి సందర్శించి అశోక్ కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం ఆర్థిక సాయం అందించి, పార్టీనుంచి సాయం అందేలా చూస్తానని కు టుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. ఆమె వెంట ఎంపీటీసీ బాసాని చంద్రప్రకాశ్, సర్పంచ్ కందకట్ల రవి, ఉపసర్పంచ్ దైనంపల్లి సుమన్, పార్టీ మండల అధ్యక్షుడు గంగుల మనోహర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ కొమ్ముల భాస్కర్, నాయకులు రాజేందర్ ఉన్నారు. ఆమె వెంట నాయకులు ఆదిరెడ్డి ఉన్నారు.

ప్రభుత్వం నుంచి సాయం అందిస్తా

శాయంపేట : ప్రభుత్వం నుంచి ఆర్థికసాయం అందేలా చూస్తానని వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి హామీ ఇచ్చారు. మండలంలోని తహారాపూర్, పెద్దకోడెపాక, ప్రగతి సింగారం గ్రామాల్లో శనివారం గాలివాన బీభత్సంతో ఇళ్ల పైకప్పు రేకులు కోల్పోయిన బాధిత కుటుంబాలకు ఆమె భరోసా ఇచ్చారు. సోమవారం ఆయా గ్రామాల్లో పర్యటించి బాధిత కుటుంబాలను సందర్శించి పరామర్శించారు. పెద్దకోడెపాక గ్రామానికి చెందిన వార్డు సభ్యుడు రమేష్ కుమారుడు తరుణ్ రోడ్డు ప్రమాదంలో గాయపడగా జెడ్పీ చైర్‌పర్సన్ పరామర్శించారు. ఆమె వెంట సర్పంచ్ అబ్బు ప్రకాశ్‌రెడ్డి, ఎంపీటీసీ వావిలాల వేణుగోపాలప్రసాద్, పార్టీ మండల అధ్యక్షుడు గంగుల మనోహర్ రెడ్డి, తహసీల్దార్ చలమల్ల రాజు తదితరులు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శంకర్

దామెర: స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రం సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎంపీపీ కాగితాల శంకర్ అన్నారు. పీహెచ్‌సీలో జన ఆరోగ్య సమితి సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీలో మరమ్మతులు చేసేందుకు పలు తీర్మానాలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం వైద్య రంగానికి పెద్దపీట వేస్తూ ప్రభుత్వ ఆస్పత్రులను బలోపేతం చేస్తుందని అన్నారు. సమావేశంలో తహసీల్దార్ ఎండీ. రియాజుద్దీన్, మండల వైద్యాధికారి డాక్టర్ ఉషారాణి, డాక్టర్ వనజ, సభ్యులు ఎస్.భాగ్యలక్ష్మి, జంగం రాణి, సర్పంచ్‌లు గురిజాల శ్రీరాంరెడ్డి, పురాణం రాజేశ్వరి పాల్గొన్నారు.

పీహెచ్‌డీ పూర్తి చేసిన 'చల్లూరి'



బాబు చల్లూరి

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలం గట్లనర్సింగాపూర్‌కు చెందిన బాబు చల్లూరి ప్రతిష్టాత్మక టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ ముంబయిలో రూరల్ డెవలప్‌మెంట్‌లో పీహెచ్‌డీ పూర్తి చేసి అపూర్వమైన ఘనత సాధించాడు. ఆర్థికవేత్త డాక్టర్ శ్రీకృష్ణ సుధీర్ పటోజు మార్గదర్శకత్వంలో బాబు పరిశోధనలు భారతదేశంలోని రైతు ఉత్పత్తి సంస్థల పనితీరు, వారు ఎదుర్కొంటున్న న వాళ్లపై దృష్టి సారించారు. పీహెచ్‌డీ పూర్తి చేయడంలో బాబు విజయం సాధించడం అతని కృషి, అంకితభావం, అతని కుటుంబం, ముఖ్యంగా బాబు అన్నయ్య డాక్టర్ ప్రవీణ్‌కుమార్ మద్దతుకు నిదర్శనమని చెప్పారు. దేశంలో రైతు ఉత్పత్తి దారుల కంపెనీల పనితీరుపై బాబు చేసిన పరిశోధనలు గ్రామీణాభివృద్ధి రంగంపై గణనీయమైన ప్రభావాలను చూపుతున్నాయి. రైతుల సాధికారత, వారి జీవనోపాధిని పెంపొందించడంలో కీలకపాత్ర పోషిస్తున్న ఈ కంపెనీల పెరుగుదల, అభివృద్ధికి తోడ్పడేందుకు సమర్థవంతమైన జోక్యాలను రూపొందించడానికి అతని పరిశోధనలు విధాన రూపకర్తలు, అభివృద్ధి అభ్యాసకులకు సహాయపడుతాయని చెప్పారు. ప్రస్తుతం బాబు అమెరికాకు చెందిన ఎఫ్ఎంసీజీ క్యాడ్‌బరీ కంపెనీలో సౌత్ఇండియా అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు.

యువత క్రీడల్లో రాణించాలి



క్రీడాకారులకు క్రీడాదుస్తులు పంపిణీ చేస్తున్న సీఐ బండారి కుమార్

ఆత్మకూరు : గ్రామీణ ప్రాంతాల్లో యువత క్రీడా రంగాల్లో రాణించాలని సీఐ బండారి కుమార్ అన్నారు. ఇటీవల సీఎం కప్ క్రీడల్లో భాగంగా మండల స్థాయిలో ప్రతిభ కనబర్చి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులకు మండల కేంద్రానికి చెందిన అండ్రు విశ్వేశ్వర్‌రెడ్డి (రాజరాజేశ్వర మెడికల్ స్టోర్స్) క్రీడాకారులకు క్రీడాదుస్తులను సీఐ ఆధ్వర్యంలో సోమవారం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడల్లో చురుగ్గా పాల్గొని సీఎం కప్ గెలుపొందాలని సూచించారు. క్రీడా దుస్తులు పంపిణీ చేసిన విశ్వేశ్వర్‌రెడ్డిని పోలీసులు, పీఈటీలు అభినందించారు. కార్యక్రమంలో ఎస్సై ప్రసాద్, పీడీ గ్రేస్, పీఈటీ శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

బిల్లులు త్వరగా చెల్లించాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్‌లు

కమలాపూర్ : మన ఊరు-మన బడికి సంబంధించిన పనుల బిల్లులు త్వరగా చెల్లించాలని మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు పెండ్యాల రవీందర్ రెడ్డి కోరారు. సోమవారం ఆయన సర్పంచ్‌లతో కలిసి జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులు పూర్తయి ఐదు నెలలు కావస్తున్నా ఇప్పటివరకు ఎలాంటి చెల్లింపులు చేయలేదన్నారు. చాలా మంది సర్పంచ్‌లు అప్పులు తెచ్చి మరీ పనులు చేశారన్నారు. డైరెక్ట్ నిధులు మాత్రం పాతశాల చైర్మన్లకు కేటాయించి మిగతా పనులు మాకు కేటాయించడం అన్యాయమన్నారు. వెంటనే పనులకు సంబంధించిన ఎంబీలు సంబంధిత అధికారులతో రికార్డు చేసి త్వరగా బిల్లులు చెల్లించాలని పేర్కొన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో మండల సర్పంచ్‌ల ఫోరం ప్రధాన కార్యదర్శి లడే గోపాల్, ఉపాధ్యక్షుడు ఇనుగాల కిరణ్మయి విజయ్, కార్యవర్గ సభ్యులు లింగమూర్తి, రమేష్, సాంబయ్య, లక్ష్మణ్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

మిల్లు భూముల్లోనే ఇళ్ల స్థలాలు కేటాయించాలి



మాట్లాడుతున్న ఆల్‌ట్రేడ్ యూనియన్ నాయకులు

నయీంనగర్: సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు వ్యతిరేకంగా ప్లాట్ల కేటాయింపును రద్దు చేయాలని, ఎంవీఆర్ఎస్ కార్మికులకు ఆజంజాహి మిల్లు భూముల్లోనే ఇళ్ల స్థలాలు కేటాయించాలని ఆల్‌ట్రేడ్ యూనియన్ సీఐటీయూ, ఏఐటీయూసీ, బీఎంఎస్ నాయకులు ఇనుముల శ్రీనివాస్, నాగపురి వెంకటేశ్వర్లు, గంగుల దయాకర్, మచ్చ రాజు డిమాండ్ చేశారు. హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ మడిపల్లిలోని ప్లాట్లను కేటాయిస్తున్నామనే పేరుతో మే 20వ తేదీన అంబేడ్కర్ భవన్‌లో డ్రా పద్ధతిలో కుడా అధికారులు, కలెక్టర్.. సుప్రీంకోర్టుకు తప్పుడు నివేదిక సమర్పించారని తెలిపారు. కార్మికులను మోసం చేయాలని వారు అనుసరిస్తున్న విధానాలను ఆల్‌ట్రేడ్ యూనియన్లు తీవ్రంగా ఖండిస్తున్నాయని పేర్కొన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న మిల్లు స్థలంలో జడ్జిమెంట్‌ను అమలు చేయకుండా అడ్డుకుంటున్న అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు.. కలెక్టరేట్ నిర్మించాలని పట్టుబట్టడం 918మంది కార్మికుల పొట్టకొట్టడానికేనని స్పష్టంగా అర్థమవుతోందని వివరించారు.

'చలో హైదరాబాద్'ను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న బ్రాహ్మణ సేవా సమితి ప్రతినిధులు

హన్మకొండ చౌరస్తా: ఈనెల 31వ తేదీన హైదరాబాద్‌లో ఆరు ఎకరాల్లో రూ.12 కోట్ల వ్యయంతో నిర్మించిన బ్రాహ్మణ భవన ప్రారంభోత్సవానికి ఉమ్మడి వరంగల్ జిల్లాలోని బ్రాహ్మణులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని బ్రాహ్మణ సేవా సమితి వరంగల్ త్రినగరి అధ్యక్షుడు పెండెం రాఘవరావు విజ్ఞప్తి చేశారు. హనుమకొండలోని బ్రాహ్మణసేవా సమితి కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2015, జనవరి 9న వరంగల్ బ్రాహ్మణ సంఘాల వేదికలో ఇచ్చిన హామీ మేరకు బ్రాహ్మణుల కోసం భవనం నిర్మించినందుకు సీఎం కేసీఆర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పేద బ్రాహ్మణుల సంక్షేమం కోసం బ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ.200 కోట్లు కేటాయించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని కొనియాడారు. కేసీఆర్ మినహాయిస్తే స్థానిక ఎమ్మెల్యేలు, ఎంపీలు.. బ్రాహ్మణ జాతికి ఎలాంటి సహా య సహకారాలు అందించడం ఆవేదన వెలిబుచ్చారు. బ్రాహ్మణ సేవా సమితి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు విష్ణుదాస్ గోపాలరావు మాట్లాడుతూ బ్రాహ్మణులు సామాజికంగా, ఆర్థికంగా మైనారిటీలుగా ఉన్నారని గుర్తుచేశారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సేవా సమితి రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు గంగు ఉపేంద్రశర్మ, విన్నకోట రాజ్‌కుమార్, డీపీఎస్ శ్రీనివాసచారి, పరశురాం, వెంకటరమణాచారి, నాగరాజు, రవీందర్, కలకుంట్ల మేఘశ్యాం, శ్రీమన్నారాయణ, శ్రీవర్ధన్ పాల్గొన్నారు.

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వివాహిత మృతి

వరంగల్ క్రైం: పెళ్లైన 9రోజులకే ఓ వివాహిత.. తను ప్రేమించిన వ్యక్తితో కలిసి క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన భీమదేవరపల్లి మండలం గొల్లపల్లిలో జరిగింది. గొల్లపల్లికి చెందిన సంగ మానస (20)కు హుస్నాబాద్ మండలం గొల్లపల్లికి చెందిన అంజితో ఈనెల 11న వివాహం జరిగింది. 18న తల్లిగారి ఇంటికి వచ్చి హనుమకొండకు చెందిన తను ప్రేమించిన విజయ్‌తో కలిసి క్రిమిసంహారక మందు తాగి 19న ఆత్మహత్యాయత్నానికి ఇరువురు పాల్పడ్డారు. ఈ క్రమంలో ఎంజీఎంలో చికిత్స పొందుతూ మానస మృతి చెందింది. కాగా, విజయ్‌ను చికిత్స నిమిత్తం హైదరా బాద్‌కు తరలించారు. బాధితురాలి తండ్రి సంగ లింగయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హనుమకొండ పోలీసులు తెలిపారు.

సైబర్ నేరాలపై అవగాహన

పర్వతగిరి : మండలంలోని వడ్లకొండ గ్రామంలో సోమవారం రాత్రి సైబర్ నేరాలపై జాగృతి పోలీసుల కళా బృందం నాటిక ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్డు ప్రమాదాలు, డయల్ -100, గుట్కా, గంజాయి, సీసీ కెమెరాల ఉపయోగాలు, మూఢ నమ్మకాలు, చెడు వ్యసనాలకు బానిసలు కావొద్దని తదితర సామాజిక అంశాలపై పాటల ద్వారా జాగృతి పోలీస్ కళా బృందం అవగాహన కల్పించింది. ఈ కార్యక్రమంలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఎస్సై దేవేందర్, సర్పంచ్ ఆమడగాని రాజుయాదవ్, మాజీ ఎంపీపీ వల్లందాస్ రంగయ్య, వల్లందాస్ వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీపై జీలుగ విత్తనాలు

ఐనవోలు : సబ్సిడీపై జీలుగ విత్తనాలు ఐనవోలు, పంథిని గ్రామాల్లోని ఆగ్రోస్ సెంటర్లలో అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి అడప కవిత సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 30 కిలోల జీలుగ బస్తా ధర సబ్సిడీ పోను రూ.843 రైతులు చెల్లించాలన్నారు. పట్టాపాసుబుక్, ఆధార్ కార్డు జిరాక్సులు అందించాలని సూచించారు. సాధారణంగా కిలో జీలుగ విత్తనం ధర రూ.80.25 ఉండగా 65 శాతం సబ్సిడీ రూ.52.16లు తీసివేయగా రూ.28.09లకు లభిస్తున్నట్లు చెప్పారు. 30 కిలోల విత్తనాలు రెండు నుంచి రెండున్నర ఎకరాలకు సరిపోతుందని పేర్కొన్నారు.

చెట్లను నరికివేసిన వారిపై చర్య తీసుకోవాలి

న్యూశాయంపేట: హనుమకొండ హంటర్‌రోడ్డులోని ఓ వేడుక మందిరం సమీపంలో హరితహారంలో భాగంగా పెంచిన చెట్లను నరికివేసిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని సామాజిక కార్యకర్త, పర్యావరణ ప్రేమికుడు ప్రకాశ్ డిమాండ్ చేశారు. ఈమేరకు అటవీశాఖ అధికారులకు సోమవారం ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. ఓ వైపు లక్షలాది రూపాయలు ఖర్చు చేసి మొక్కలు నాటుతుంటే.. మరోవైపు కొంతమంది షాపు యజమానులు అడ్డంగా చెట్లు ఉన్నాయని నరికివేయడం భావ్యం కాదని సూచించారు. రోజురోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతుండగా మొక్కలను నాటి పెంచాల్సింది పోయి నరికివేయడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు.

ఏనుమాముల సీఐని కలిసిన నాయకులు

వరంగల్: ఏనుమాముల పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ మహేందర్‌ను స్థానిక బీఆర్ఎస్ నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. కార్యక్రమంలో నాయకులు వేముల నవీన్, 3వ డివిజన్ పార్టీ అధ్యక్షుడు నేరెళ్ల రాజు, 14 డివిజన్ ప్రధాన కార్యదర్శి పత్రి సుభాష్, పైడిపల్లి సొసైటీ డైరెక్టర్ నాగవరపు సుధాకర్, రాజ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

జీవ వైవిధ్యంతోనే మనుగడ

రామన్నపేట: జీవ వైవిధ్యంతోనే మానవ మనుగడ కొనసాగుతుందని ప్రముఖ పర్యావరణవేత్త ప్రొఫెసర్ ఠాగూర్ రతన్‌సింగ్ తెలిపారు. ప్రపంచ జీవ వైవిధ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏవీవీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి కాడిమాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జీవ వైవిధ్యంపై సోమవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఠాగూర్ రతన్‌సింగ్ మాట్లాడుతూ భూమిపై ఉన్న అనేక మిలియన్ల వివిధ జాతుల జీవ వైవిధ్యం కొన్ని లక్షల సంవత్సరాల పరిణామమని వివరించారు. మానవ జీవన శైలితో పర్యావరణం కాలుష్యమై ప్లాస్టిక్ వినియోగం, చెట్లు నరకడం అధిక ఉష్ణోగ్రతలపై నియంత్రణ లేకపోవడం, ఏసీలు, రిఫ్రిజిరేటర్లు అధికంగా వాడటం ద్వారా భూగోళం వేడెక్కి జీవరాశులకు పెద్ద ముప్పు వాటిల్లుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈక్రమంలో జీవ వైవిధ్యం, పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.భుజేందర్‌రెడ్డి, సంజీవ, అనిత, కార్యకర్తలు పాల్గొన్నారు.